క్లుప్తంగా

కండలేరులో 55.160 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో శనివారం నాటికి 55.160 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 200, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు


వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

చిల్లకూరు: మండలంలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి ఆదేశించారు. ఆమె శనివారం చిల్లకూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగు కేసులపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారిపై నిఘా పెట్టి గంజాయి, ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదగా నడుచుకోవాలని పేర్కొన్నారు. రూరల్ సీఐ కిశోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఆదిలక్ష్మీ

నాయుడుపేట టౌన్ : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్ఐ ఆదిలక్ష్మీ తెలిపారు. ఆమె శనివారం తిమ్మాజికండ్రిగ సమీపంలో వాహనాల తనిఖీ చేశారు. లైసెన్సులు, రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు. అదే విధంగా పట్టణంలో పలు కూడళ్ల వద్ద రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

కాంక్రీట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయవద్దని నిరసన


ఆందోళన చేస్తున్న కాలనీ వాసులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని వద్దిగుంటకండ్రిగ గ్రామం ఎస్సీ, ఎస్టీ కాలనీ సమీపంలో కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయవద్దని స్థానికులు శనివారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్లాంట్ వల్ల ఈ ప్రాంతం దుమ్ముధూళితో నిండిపోయి రోగాల బారిన పడాల్సి వస్తుందని వాపోయారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అధికారులు స్పందించి అనుమతులు రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

వరిలో కలుపును నివారించుకోవాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సైదాపురం: వరి పంటలో కలుపు మొక్కలను నివారించడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని ఏవో హైమావతి తెలిపారు. మండలంలోని పొలూరు, అనంతమడుగు గ్రామాల్లో శనివారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వరి పంటకు రసాయనిక ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగుళ్లను నియంత్రించవచ్చని వివరించారు.

కుటుంబాలకు అండగా ఉండాలి

చిల్లకూరు : మహిళలు కుటుంబాలకు అండగా ఉండాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. ఆమె శనివారం గూడూరులోని సునీత సేవా సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. యువతులతో మాట్లాడారు. మహిళలకు ఏదైనా ఇబ్బంది వస్తే వెంటనే తనకు ఫోన్ లేదా మెసేజ్ చేయాలని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. విశ్రాంత ఇంజినీర్ భాస్కరరావు, సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మీ పాల్గొన్నారు.

బైక్ బోల్తాపడి యువకుడికి తీవ్ర గాయాలు

దొరవారిసత్రం: నెలబల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి బైక్ బోల్తాపడి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. వాకాడు మండల నెల్లిపూడికి చెందిన విజయ్‌కుమార్ తడ మండలం మాంబట్టులోని అపాచీ కంపెనీలో పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధు లు ముగించుకుని ఇంటికి వెళుతుండగా నెలబల్లి గ్రామ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన విజయ్‌కుమార్‌ను స్థానికులు 108లో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అతన్ని నెల్లూరుకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టించుకునే వారేరి..?


శిథిలావస్థకు చేరిని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

మండల కేంద్రమైన రాపూరులో ఉన్న పంచాయతీ రాజ్, ఆర్‌అండ్ బీ అతిథి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం బ్రిటీష్ కాలంలో నిర్మించారు. పైకప్పు కోసం వేసిన పెంకులు పడిపోయాయి. విలువైన టేకు కొయ్యలు పాడయ్యాయి. జిల్లా పరిషత్ అతిథి గృహం కూడా శిథిలావస్థకు చేరుకుంది. వాటికి మరమ్మతులు చేసి ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించుకోవాలని పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి మూతపడింది. తలుపులు దెబ్బతిన్నాయి. ఇక్కడ 12 మంది గ్యాగ్‌మెన్లు పనిచేస్తుండగా ఒకరూ లేరు. నలుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి వున్నా వారి జాడ లేదు. పొదలకూరు ఏఈ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. – రాపూరు


మూతపడిన పంచాయతీరాజ్ అతిథి గృహం


ఆర్‌అండ్‌బీ కార్యాలయం

మంచు దుప్పటి



వాకాడు మండలంలో కొన్ని రోజులుగా మంచు విపరీతంగా కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు దట్టమైన పొగమంచు కురుస్తుండడంతో రోడ్లు కనిపించడం లేదు. వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. మంచుతో పాటు చలిగాలులు వీస్తుండడంతో కూలి పనులకు వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. మంచు కారణంగా పంటలకు తెగుళ్లు సోకుతున్నాయని రైతులు వాపోతున్నారు. – వాకాడు



శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ


స్వామి, అమ్మవార్లను ఊంజల్ సేవ మండపానికి తీసుకువస్తున్న అర్చకులు

రాపూరు : మండలంలోని పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి శనివారం సాయంత్రం శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి తిరుచ్చిపై కొలువుదీర్చారు. శోభాయమానంగా అలంకరించి సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

వైభవంగా గొబ్బెమ్మ ఊరేగింపు



రాపూరు:మండల కేంద్రమైన రాపూరులోని తూర్పు అగర్తలో ఏర్పాటు చేసిన గొబ్బెమ్మ గ్రామోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొబ్బెమ్మను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపంలో కొలువుతీర్చి వివిధ ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారిని భక్తులు తలపై ఉంచుకుని తప్పెట్లు, తాళాలతో గొబ్బి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ తీసుకెళ్లి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేసిన అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న తంబిరెడ్డి మనోహర్ రెడ్డి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని శ్రీవేము డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రిపబ్లిక్ డేను పురస్కరించుకుని కళాశాల కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. ఇందులో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు, యువత, అధ్యాపకులు 73 మంది రక్తదానం చేశారు. నెల్లూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యులు, సిబ్బంది సౌజన్యంతో ప్రతి ఏటా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తంబిరెడ్డి మనోహర్ రెడ్డి వెల్లడించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజర్ రంజిత్ రెడ్డి, జితేంద్ర రెడ్డి, సన్నీ, రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన మధుసూదనరావు, నిర్మల, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మధుకృష్ణ, సుబ్బారెడ్డి

ఓజిలి: మండలంలోని చిలమానుచేనులో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం పెన్‌వీర్ సంస్థల ఎండీ గంటా మధుకృష్ణ, గాయత్రి దంపతులు, బచ్చల సుబ్బారెడ్డి ప్రారంభించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాంప్రసాద్‌రాజు తన తండ్రి యల్లంరాజు వెంకటకృష్ణంరాజు జ్ఞాపకార్థం వాటర్ ప్లాంట్ షెడ్డు, పెన్‌వీర్ సంస్థల నిర్వాహకులు మోషిన్లను వితరణ చేశారు. రూ.9 లక్షలతో ప్లాంట్ నిర్మించిన దాతలను గ్రామస్తులు సన్మానించారు. రామ్మూర్తిరాజు, కొండూరు దామోదర్‌రాజు, మధుశేఖర్ రాజు, పరంధామరాజు, దొమ్మ రాజు దామోదర్ రాజు, వెంకటేశ్వర్లు రాజు, వంశీ, కే వెంకటసుబ్బరాజు, శంకర్‌రాజు పాల్గొన్నారు.

నేడు వీనస్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం

సూళ్లూరుపేట/పెళ్లకూరు: సూళ్లూరుపేట పట్టణంలోని వీనస్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ కె.వెంకన్నబాబు తెలిపారు. ఇందులో ఉచితంగా ఓపీ చూస్తామని, 50 శాతం రాయితీతో రక్త పరీక్షలు, 30 శాతం తగ్గింపుతో సీటీ స్కాన్, 15 శాతం తగ్గింపుతో మందులు ఇస్తామని తెలిపారు. ఆరోగ్యరక్షలో భాగంగా రూ.2,990లతో బాడీ చెకప్, రూ.990లతో హార్ట్ చెకప్ చేస్తామని వెల్లడించారు. వైద్య శిబిరానికి వచ్చే వారు తెల్ల రేషన్‌కార్డు తీసుకురావాలని కోరారు.

బెల్ట్ షాపుల నిర్వహణపై పోరుబాట

- గ్రామాల్లో మద్యం ఏరులై పారిసున్నారు
- కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు
- సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట/నాయుడుపేట టౌన్ : కూటమి ప్రభుత్వంలో వీధి వీధిలోనూ బెల్టు షాపులు ఏర్పాటుచేసి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. ఆయన శనివారం నాయుడుపేటలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టించి పేదలకు పంచుతామని చంద్రబాబు చెప్పారని, అందుకు విరుద్ధంగా మద్యం దందాతో ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నారని దుయ్యబట్టారు. దీన్ని అడ్డుకునేందుకు ప్రజలతో కలిసి పోరుబాటకు సిద్ధమైనట్టు తెలిపారు. నాణ్యమైన మద్యం అందిస్తామని చెబుతూ వీధివీధిలోనూ బెల్టు షాపులు పెట్టారని ఆరోపించారు. ఏటీఎం తరహాలో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంచి పేదల్లోను మద్యానికి బానిసలను చేస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో తాగునీరు సక్రమంగా అందడం లేదని, మద్యం మాత్రం ఏరులై పారుతోందన్నారు. సహజ వనరులైన ఇసుక, సిలికా, క్వార్ట్జ్, గ్రావెల్‌ను ఇష్టారాజ్యంగా కొల్లగొడుతూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రత్యర్థులపై రాజకీయ కక్ష సాధింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా కూటమి నేతలు తీరు మార్చుకుని ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు.

సూళ్లూరుపేట విద్యార్థిని ప్రతిభ


బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

సూళ్లూరుపేట/సూళ్లూరుపేట రూరల్ : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తిరుపతిలో శనివారం జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని స్వాతిక ప్రతిభ చూపిందని హెచ్ఎం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆమె తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.మౌర్య, పద్మావతి మహిళా వర్సిటీ వీసీ సుధ చేతుల మీదుగా తృతీయ బహుమతి అందుకుందని పేర్కొన్నారు. ఆమెను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం


చిల్లకూరు : సీనియర్ ఓటర్లకు సన్మానం


నాయుడుపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ఓజిలి: మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన సీనియర్ ఓటర్లను తహసీల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో డీటీ మధుసూదన్‌రాజు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగమే దేశ సేవ

దక్కిలి: ఓటు హక్కును వినియోగించుకోవడమే అసలైన దేశ సేవ అని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా సీనియర్ ఓటర్లను సన్మానించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ శివశంకర్, సీడీపీవో శంషాద్‌బేగం, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ అనూరాధ, డీటీ ప్రసన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమళ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం

కోట: ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని తహసీల్దార్ జయజయరావు తెలిపారు. విద్యార్థులతో కలిసి కోట క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. డీటీ అజంతుల్లాఖాన్, ఆర్ఐ మధుమిత పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : ఓటుహక్కు సామాన్యుడి చేతిలో వజ్రాయుధమని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణ, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరులో..

చిట్టమూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను తహసీల్దార్ విజయలక్ష్మీ సత్కరించారు. అంతకు ముందు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన బలరామయ్య, డీటీ నిరంజన్ పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: నాయుడుపేటలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దారు రాజేంద్ర, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, ఎంఈవో మునిరత్నం మహిళలు, విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు.

సైదాపురంలో..

సైదాపురం: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని డీటీ ఆశాజ్యోతి తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఏఎస్ఓ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

కలువాయిలో..

కలువాయి : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. తహసీల్దార శ్యామ్‌సుందర్‌రాజు ఓటు ఆవశ్యకతను వివరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మెయిన్ పాఠశాలలో సీనియర్ సిటిజన్లను సత్కరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంఈవో శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విక్టోరియారాణి, అధ్యాపకులు పి.రాజు, బి.శ్రీనివాసులు, పి.ఏడుకొండలు, ఎం.అమ్మాజీ, సుబ్రమణ్యం శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: ప్రతి పౌరుడికీ ఓటుహక్కు ఒక ఆయుధమని తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో ఓటరు దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డీటీ యువరాజ్, ఆర్ఐ సంతోషిని, ఏఎస్‌వో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుధాకర్ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవం నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటరును సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రజేంద్రరెడ్డి, శ్రీనివాసులు, వీవీకుమార్, చంద్ర, సురేంద్ర, శ్రీలక్ష్మీ, సునంద, ఆదిలక్ష్మి, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు రూరల్ : గూడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటరు దినోత్సవం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు.

వాకాడులో..

వాకాడు : ఓటు హక్కు సామాన్యుడి చేతిలో వజ్రాయుధమని డీటీ సందీప్ తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వాకాడులో ర్యాలీ నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ అఖిల్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.


చిట్టమూరులో ఓటర్లను సత్కరిస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మీ


సూళ్లూరుపేట : ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు


వాకాడులో ర్యాలీ ..

ప్రసాద్‌రెడ్డికి పరామర్శ


గోపాల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెందోటి కార్తీక్‌రెడ్డి

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం మన్నూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కాటూరు ప్రసాద్‌రెడ్డి తండ్రి గోపాల్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి శనివారం గ్రామానికి చేరుకున్నారు. గోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తర క్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గుండబోయిన గోపాల్‌యాదవ్, కాటూరు రవీంద్రరెడ్డి, చిల్లకూరు సురేంద్రరెడ్డి, చేరజర్ల గోపి, హస్తకావేరి గుంజి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ పథకం

కోట : ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న పీఎం సోలార్ సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీ చిన్నయ్య తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానళ్లను ఉచితంగా అందజేస్తామన్నారు. అలాగే ఇప్పుడు వాడుకుంటున్న 200 యూనిట్ల పథకానికి అదనంగా పొందవచ్చన్నారు. వినియోగదారుడు సంబంధిత వెబ్‌సైట్‌లో విద్యుత్ సర్వీసుకు సంబంధించిన వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో సోలార్ ప్యానళ్లు ఏర్పాటుచేస్తుందని వివరించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

మెట్ట పొలం కావలెను.
మండలానికి / గ్రామానికి 1కి.మీ దూరంలో 33 అడుగుల దారి కలిగిన 4 ఎకరాలు మెట్ట పొలం ఇండస్ట్రీయల్ కొరకు కావలెను.
1 ఎకర 5లక్షలు
సెల్: 7997775678

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గూడూరు : 90108 97733, 99122 20591
వెంకటగిరి : 99122 20591
సూళ్ళూరుపేట : 90102 23710